
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 37.0 ; కనిష్ఠం : 26.0
ANDHRAJYOTHY





రంజాన్ వేళలు
ఇఫ్తార్(సోమవారం-6:30
సహర్ (మంగళవారం-5:05

జీతాలు లేక పస్తులుంటున్నాం..

» ఎనిమిది నెలలుగా అందని వేతనాలు

» ఇబ్బంది పడుతున్న ప్రభుత్వ ఆస్పత్రి కాంట్రాక్టు సిబ్బంది

6

సహాయక చర్యల్లో కీలక ముందడుగు

- ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ నుంచి గురుప్రీత్ సింగ్ మృతదేహం వెలికితీత
- మరో ఏడుగురి కోసం నాలుగు షిఫ్టుల్లో సహాయక చర్యలు
- క్యాడవర్ డాగ్స్ గుర్తించిన మూడు ప్రాంతాల్లోనే లభించే అవకాశం
- షీర్ జోన్‌లో ఉండటంతో మరో ప్రమాదం జరగకుండా ఎత్తుగడలు
- ఐరన్ వ్యర్థాలు కట్ చేసి తరలిస్తుండటంతో రెస్క్యూ టీంలు ముందుకు..
- గుర్తించిన ప్రాంతాల్లో మైన్స్‌లో మాదిరి టైగర్ క్లాగ్స్ సపోర్ట్‌తో తవ్వకం

మహబూబ్‌నగర్, దోమలపెంట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): శ్రీశైలం ఎడమగట్టు కాలువ టన్నెల్‌లో పైకప్పు కూలి ఎనిమిది మంది చిక్కుకోగా.. 16 రోజులుగా వారిని రక్షించడానికి సహాయక చర్యలు కొనసాగుతున్న విషయం తెలిసిందే.. కార్మికులను వెలికితీసే ప్రక్రియలో ఆదివారం కీలక ముందడుగు పడింది. రాబిన్స్‌కు చెందిన ఆపరేటర్ గుర్‌ప్రీత్ సింగ్ మృతదేహం లభ్యమైంది. ఆ మృతదేహాన్ని బయటికి తెచ్చి నాగర్‌కర్నూల్‌కు తరలించారు. సహాయక చర్యల్లో భాగంగా దాదాపు 600 మంది వరకు 12 ఏజెన్సీలకు చెందిన సిబ్బంది పని చేస్తున్నారు. ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, సింగరేణి, ర్యాట్ హోల్ మైనర్స్ ఆర్మీ, నేవీ, బార్డర్ రోడ్ ఆర్గనైజేషన్, రైల్వే తదితర ఏజెన్సీలు నిర్విరామంగా నాలుగు షిఫ్టులుగా పని చేస్తున్నాయి. అయితే ప్రమాదం జరిగిన తర్వాతి రోజే దాదాపు అందులో ఇరుక్కుపోయిన వారు జీవించి ఉండే అవకాశం లేదని స్పష్టం కాగా.. టీబీఎం కంపార్ట్‌మెంట్లు లేదా ప్రమాదం జరిగిన స్థలంలో ఏవైనా గ్యాపులు ఉంటే అక్కడ ఉంటారనే



గురుప్రీత్‌సింగ్ మృతదేహాన్ని వెలికితీసిన సింగరేణి రెస్క్యూ బృందం



గురుప్రీతిసింగ్ మృతదేహం దొరికిన ప్రాంతం

ఆశతో సహాయక చర్యలు కొనసాగించారు. భారీగా ఉబికి వస్తున్న ఊట నీరు, పేరుకుపోయిన బురద, కూలిన మట్టిపై అనుకుని ఉన్న సెగ్మెంట్ బ్లాకులు, మరో ప్రమాదం జరిగే అవకాశం ఉందనే హెచ్చరికలు, 20 ఫీట్లకు పైగా పేరుకున్న మట్టి.. అడ్డుగా ఉన్న టీబీఎం, పనిచేయని కన్వేయర్ బెల్టు, లోకో కొంత దూరం వరకే వెళ్లే అవకాశం ఉండటం.. తవ్విన మట్టిని, కట్ చేసిన వ్యర్థాలను బయటకు తరలించే అవకాశం లేకపోవడం సహాయక చర్యలకు ఆటంకంగా మారాయి. టన్నెల్‌కు ఒకేదారి ఉండటం, ఎస్కేప్ రూట్ లేకపోవడంతో చాలా క్లిష్టంగా మారింది. పెద్ద పెద్ద యంత్రాలను లోపలకు తీసుకెళ్లలేక ఇబ్బందులు పడ్డారు. అయితే ప్లాస్మా, గ్యాస్ కట్టర్లతో టీబీఎంను కట్ చేసి, ఆ వ్యర్థాలను బయటకు తరలిస్తుండటంతో సహాయక బృందాలు ముందుకు వెళ్లి జీపీఆర్, క్యాడవర్ డాగ్స్ గుర్తించిన ప్రాంతాల్లో తవ్వకాలు చేయగలుగుతున్నాయి.

ఆ మూడు ప్రాంతాల్లోనే..

ప్రస్తుతం గుర్తించి.. వెలికితీసిన గుర్‌ప్రీత్‌సింగ్ మృతదేహం ఉన్న ప్రాంతంతో పాటు మరో మూడు ప్రాంతాల్లోనే అందరూ ఉంటారని భావిస్తున్నారు. గుర్‌ప్రీత్ సింగ్ మృతదేహం దాదాపు 12 ఫీట్ల లోతులో దొరకగా.. మిగతా వారివి 15 ఫీట్ల లోపల ఉంటాయని అంచనా వేస్తున్నారు. అయితే ఆ మూడు ప్రాంతాలు దాదాపు షీర్ జోన్ పరిధిలో 10 నుంచి 15 మీటర్ల మధ్యలో ఉంటాయని తెలుస్తోంది. గుర్‌ప్రీత్‌సింగ్ మృతదేహం వెలికితీసే క్రమంలో డీకంపోజ్ వాసనలు వెలువడగా, క్యాడవర్ డాగ్స్ కూడా పొరపడే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే కేవలం వాసన ఆధారంగా ఎంత లోతులో ఉన్నా గుర్తించే సామర్థ్యం ఈ డాగ్స్ ప్రత్యేకత కాగా. 15 ఫీట్ల మేర మట్టి ఉండటంతో వాసనలు బయటకు రావడం లేదు. గుర్తించిన ప్రాంతాల్లో అక్కడక్కడా రంధ్రాలు

(మిగతా 6లో..)



టైగర్ క్లాగ్స్‌ను అన్‌లోడ్ చేస్తున్న కార్మికులు



పీర్లగుట్టకు నిప్పు

- వనపర్తి పట్టణంలో ఘటన

7



కరోనా మహమ్మారికి ఐదేళ్లు

- ఉమ్మడి జిల్లాలో తొలి కేసు నమోదు

7

అర్ధరాత్రి ఇంట్లో చోరీ

- బంగారు, వెండి అపహరణ

సిర్పవాడలో చోరీ అనంతరం తెరిచి ఉంచిన బీరువా



7

కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి

- మంత్రి జూపల్లి కృష్ణారావు
- రూ.6.5కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



చంద్రబండ తండాలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

పెద్దకొత్తపల్లి/పెంట్లవెల్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంలోనే గ్రామాల అభివృద్ధి జరుగుతోందని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా పెద్ద కొత్తపల్లి మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. వెన్నచెర్ల నుంచి గన్యాగుల వరకు రూ.3.4కోట్లతో బీటీ రోడ్డు, వెన్నచెర్లలో రూ.50 లక్షలతో అంతర్గత సీసీరోడ్లు, సీఆర్‌ఆర్ నిధుల నుంచి రూ.3.40 కోట్లతో ఆదిరాల నుంచి ముష్టిపల్లి వరకు బీటీ రోడ్డు అలాగే గ్రామంలో ఈజీఎస్ ద్వారా సీసీరోడ్డు నిర్మాణం, కొత్త యాపట్లలో రూ.2.95కోట్లతో 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు అలాగే చంద్రబండతండాలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. అలాగే సాతాపూర్‌లో 200మంది రైతులకు మంత్రి జూపల్లి ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వంలో అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలకు వర్తింపజేస్తామని స్పష్టం చేశారు. ఈ నెలాఖరు వరకు రైతు భరోసా పథకం ద్వారా రైతులకు బ్యాంక్‌ఖాతాలో డబ్బులు జమ చేస్తామని తెలిపారు. అదేవిధంగా జగన్నాథపురం గ్రామంలో వీరాంజనేయస్వామి ఆలయంలో జరిగిన ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమంలో మంత్రి పాల్గొని పూజలు చేశారు. సాతాపూర్‌లో బీఆర్‌ఎస్ కార్యకర్తలు 30మంది మంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పెంట్లవెల్లి మండలంలోని జటప్రోలు గ్రామంలో వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. త్వరలో జటప్రోలు గ్రామంలో రూ.150 కోట్లతో ఇంటిగ్రేడ్ పాఠశాల నిర్మాణం చేపడతామని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో టీపీ సీసీ సభ్యుడు చింతలపల్లి జగదీశ్వర్‌రావు, ఎంపీపీ మాజీ సభ్యులు మురళీధర్, ప్రతాప్‌గౌడ్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ విష్ణు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మామిడికి రక్షణ కవచం

- తెగుళ్ల నుంచి కాపాడేందుకు కాయలకు కవర్లు కడుతున్న రైతులు
- నాణ్యమైన దిగుబడి రావడంతో మార్కెట్లో భలే డిమాండ్
- సబ్సిడీపై కవర్లు అందిస్తున్న ప్రభుత్వం

పెబ్బేరు రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కాలంలో మామిడి రైతులను తెగుళ్ల బెడద తీవ్రంగా వేధిస్తోంది. మామాడి కాయలకు నల్లతామర, పండు ఈగ, తేనె మంచు, మసి తెగులు, బంక తెగుళ్ల నుంచి కాయలను కాపాడుకునేందుకు రక్షణ కవర్లు కడుతున్నారు.

మామిడి కాయలు నిమ్మకాయ సైజులు వచ్చినప్పుడు కవర్లను కట్టాలి. కవర్లు తొడిగిన మామిడి కాయలు 70 రోజుల తర్వాత నాణ్యతగా దిగుబడి వస్తున్నాయి. నిల్వ, రవాణ సందర్భాల్లో తొందరగా పాడవకుండా ఉంటాయి. జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి గిరాకీ ఉండటంతో అధిక ధర వస్తుంది. కవర్లు కట్టిన తర్వాత ఏ కాయలు ఎప్పుడు కోతకు వస్తాయి అనేది గుర్తు పట్టుకునేందుకు కవర్లపై గుర్తులు వేసుకోవాలి. దీంతో ఉద్యాన శాఖ అధికారులు 50 శాతం రాయితీతో కవర్లు అందిస్తోంది. ఒక్కొక్క కవరు ధర రూ.2.25 ఉంటుంది. ఎకరాకు 4 వేల నుంచి 8 వేల కవర్లు అందిస్తోంది. రైతులు పట్టాపాస్‌బుక్ జిరాక్స్, ఆధార్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్, పాస్‌పోర్టు సైజు ఫొటో, దరఖాస్తు ఫారం ఉద్యాన శాఖ అధికారులకు అందజేయాలి. జిల్లా వ్యాప్తంగా 14వేల ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇప్పటి వరకు రైతులకు జిల్లా వ్యాప్తంగా 5.50 లక్షల కవర్లను అందించగా, 3.60 లక్షల కవర్లు కావాలని కంపెనీ అధికారులను కోరినట్లు ఉద్యానశాఖ అధికారులు తెలియజేస్తున్నారు.



మామిడి తోటలో కాయలకు కవర్లను కడుతున్న మహిళలు

రైతుల ప్రయోజనాల కోసమే..

జిల్లా వ్యాప్తంగా మామిడి తోటలు సాగు చేస్తున్న రైతులు మామిడి కాయలను కాపాడుకునేందుకు సబ్సిడీపై కవర్లను అందిస్తున్నాం. మామిడి కాయలకు కవర్లను తొడిగించడంతో కాయలు నాణ్యతగా ఉంటాయి. దీంతో మార్కెట్లో మంచి డిమాండ్ ఉంటుంది.

- కృష్ణయ్య, ఉద్యానశాఖ అధికారి, పెబ్బేరు

కల్వకుర్తికి వంద పడకల ఆసుపత్రి

- రూ.45 కోట్ల 50లక్షలు మంజూరు



కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రి

కల్వకుర్తి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 100 పడకల ఆస్పత్రిని మంజూరు చేసింది. ఆసుపత్రి నిర్మాణం కోసం రూ.45.50 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. టెండరు ప్రక్రియ ప్రారంభమైంది. దీంతో కల్వకుర్తి ప్రాంత ప్రజల చిరకాల కల సాకారం కానుంది. ప్రస్తుతం ఉన్న సీహెచ్‌సీని ఎంసీహెచ్(మాతా శిశు సంరక్షణ కేంద్రంగా) మార్చనున్నారు. కల్వకుర్తి మూడు జాతీయ రహదారులకు కేంద్ర బిందువుగా ఉండటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రమాదాల్లో గాయపడ్డ వారికి మెరుగైన వైద్యం అందుబాటులో లేకపోవడంతో హైదరాబాద్ ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. వంద పడకల ఆసుపత్రిని ప్రభుత్వం మంజూరు చేయడంతో మెరుగైన వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లే పరిస్థితి ఉండదని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మెరుగైన వైద్య సేవలందిస్తాం



ఎన్నికల ప్రచారంలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనరసింహ సహకారంతో వంద పడకల ఆసుపత్రిని మంజూరు చేయించాం. గతంలో కేవలం హడావిడిగా హామీలకే పరిమితమైన వంద పడకల ఆసుపత్రి మన ప్రాంత వాసి అయిన సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో కల సాకారం కానుంది.

- కశిరెడ్డి నారాయణరెడ్డి, ఎమ్మెల్యే కల్వకుర్తి

అద్దె.. అవస్థ



» సౌకర్యాలు లేమితో విద్యార్థుల ఇబ్బందులు

- » జిల్లాలో సొంత భవనాలకు నోచుకోని సంక్షేమ హాస్టళ్లు
- » అద్దె భవనాల్లో 20 వసతి గృహాలు
- » వేలకు వేలు చెల్లిస్తున్న అద్దె

నాగర్‌కర్నూల్ టౌన్, మార్చి9 (ఆంధ్రజ్యోతి): పేద, మధ్య తరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాలను ఏర్పాటు చేసింది. కానీ జిల్లాలో కొన్ని వసతి గృహాలకు సొంత భవనాలు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో మొత్తం 77వసతి గృహాలు నిర్వహిస్తుండగా వాటిలో 20 వసతి గృహాలకు అదె భవనాల్లో కొనసాగుతున్నాయి. ప్రతీ నెల లక్షల్లో అద్దె చెల్లిస్తుస్తున్నా కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పట్టణ ప్రాంతాల్లో నెలకు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు అద్దె చెల్లిస్తుండగా గ్రామీణ ప్రాంతాల్లో రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు చెల్లిస్తున్నారు. జిల్లాలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న అన్ని వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మించి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించాల్సిన అవసరం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు.



నాగర్‌కర్నూల్ పట్టణంలో అద్దె భవనంలో కొనసాగుతున్న ఎస్సీ డీ-హాస్టల్

జిల్లాలో సంక్షేమ వసతి గృహాలు ఇలా..

సంక్షేమశాఖ	హాస్టల్స్ సంఖ్య	అద్దె భవనాలు
1.సాంఘీక సంక్షేమం	35	6
2.గిరిజన సంక్షేమం	14	3
3.బీసీ సంక్షేమం	28	11
మొత్తం	77	20

చాలా ఇబ్బందిగా ఉంది



హాస్టల్‌ను అద్దె ఇంటిలో ఏర్పాటు చేశారు. ఇందులో గదులు ఇరుకుగా ఉన్నాయి. పడుకోవడానికి ఇబ్బంది ఉంది. బాత్రూంలు, టాయిలెట్స్ అందరికి సరిపడా లేవు. తాగునీటి సవతి లేదు. వంటగది పక్కనే ఉండటం వల్ల పొగ వస్తోంది. ప్రభుత్వ భవనం అయితే మాకు సౌకర్యవంతంగా ఉంటుంది.

- నాగరాజు, డీ-హాస్టల్, నాగర్‌కర్నూల్

హత్యలకు దారితీస్తున్న వివాహేతర సంబంధాలు

» రోడ్డున పడుతున్న కుటుంబాలు

ఆకర్షణ, వ్యామోహం, డబ్బు కోసం కొందరు నడుపుతున్న వివాహేతర సంబంధాలు పేగుబంధాలను తెంచుతున్నాయి. కట్టుకున్నవారిని కడతేరుస్తున్నాయి. ఆ తరువాత బాధిత కుటుంబం వీధినపడుతోంది. క్షణికావేశంతో చేస్తున్న తల్లిదండ్రుల తప్పులకు చిన్నారులు దిక్కులేనివారవుతున్నారు. రెండేళ్లలో వనపర్తి జిల్లాలో ఇలాంటి ఘటనలు ఎన్నో చోటు చేసుకున్నాయి.

-వనపర్తి క్రైం, ఆంధ్రజ్యోతి



పాన్‌గల్‌లో ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన కేసులో నిందితులను అరెస్టు చేసిన పోలీసులు(ఫైల్)

6

కాల్వలకు సీసీ వేయాలి

» చివరి ఆయకట్టుకు సాగునీరు అందాలి

» రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాసులు



కోడేరు-ముత్తిరెడ్డిపల్లి గ్రామాల మధ్యలో కాల్వ కింద పొలాల్లో ఏపుగా పెరిగిన జమ్ము

కోడేరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : కేఎల్ఐ కాల్వల ద్వారా చివరి ఆయకట్టుకు సాగునీరు అందాలంటే కాల్వలకు సీసీ వేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం. శ్రీనివాసులు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేఎల్ఐ సబ్ కెనాల్ ద్వారా వ్యవసాయానికి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందాలం టే కాల్వలకు సీసీ వేయాలని అన్నారు. కాల్వలకు సీసీ వేయకపోవడంతో కాల్వలో జమ్ము, కంపచెట్లు, గడ్డి తదితర పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి నీరు ముందుకు పోవడం లేదన్నారు. సాగునీరు సాఫీగా ముందుకు వెళ్లకపోవడంతో కాలువలు తరచుగా తగ్గిపో తూ పంట నష్టంతో పాటు సాగునీరు వృథా అవుతోందని అన్నారు. అధికారులు చివరి ఆయకట్టుకు నీరు అందాలనే ఉద్దేశంతో నీరు ఎక్కువగా విడుదల చేయడంతో కాలువలు ఎక్కి పారుతున్నాయని అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కాల్వలను పరిశీలించి వెంటనే సీసీ వేయాలని కోరారు.

యువ విజ్ఞాన్-2025కి దరఖాస్తుల స్వీకరణ

వనపర్తి రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : యువ శాస్త్రవేత్తలను తయారు చేయాలనే ఉద్దేశంతో ఇస్రో ఆధ్వర్యంలో 9వ తరగతి విద్యార్థులకు యువ విజ్ఞాన్ 2025 కార్యక్రమానికి ఈ నెల 24 నుంచి మార్చి 23 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఇన్‌చార్జి డీఈవో అబ్దుల్ ఘని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భావిభారత శాస్త్రవేత్తల తయారీకి చక్కటి అవకాశమని, ప్రస్తుతం 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు అని తెలిపారు. పాఠశాల విద్యార్థుల కోసం యంగ్ సైంటిస్టులను తయారు చేయాలనే ఉద్దేశంతో యువ విజ్ఞాన్ కార్యక్రమం నిర్వహి స్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని 2019 నుంచి నిర్విరామంగా కొనసాగిస్తున్నారు. పాఠశాల విద్యార్థులకు అంతరిక్ష సాంకేతిక, అంతరిక్ష శాస్త్రంపై అవగాహన, వాటిని నిజ జీవితంలో ఉపయోగించుకోవడం వంటి ప్రాథమిక జ్ఞానం అందించడమే లక్ష్యంగా పని చేస్తుంది. యంగ్ సైంటిస్టుల పేరిట ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. వనపర్తి జిల్లాలో అన్ని యాజమాన్యాల్లో చదువుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని కోరారు. అధికారిక ఇస్రో వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, దీనిని ఓపెన్ చేసిన తరువాత యువిక ఆప్షన్‌పై క్లిక్ చేయాలన్నారు. విద్యార్థికి సంబంధించిన వివరాలను పూర్తి చేయాలని, మెయిల్ ఐడీకి ఒక లింక్ వస్తుందని, విద్యార్థి స్పేస్ క్విజ్‌లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. విద్యార్థికి సంబంధించిన పూర్తి వివరాలు ఆన్‌లైన్‌లో పూర్తి చేయాలన్నారు. ఫిబ్రవరి 24 నుంచి మార్చి 23- 2025 వరకు దరఖాస్తులు స్వీకరణ, ఏప్రిల్ 7న 2025న ఎంపికైన జాబితా విడుదల, మే 19 నుంచి మే 30, 2025 వరకు రెండు వారాల వరకు ఏడు కేంద్రాల్లో విద్యార్థులను ఎంపిక చేస్తారని చెప్పారు. కార్యక్రమానికి ఎంపికైన విద్యా ర్థులకు ఇస్రోకు చెందిన కేంద్రాల్లో శిక్షణ ఇస్తారన్నారు. ఇస్రో వారు చేప ట్టిన కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని వారి లోపల ఉన్న ప్రతిభను వెలికి తీసి భావి భారత పౌరులుగా తయారు కావడానికి ఇది మంచి అవకాశమన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చొరవ తీసుకుని ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు దరఖాస్తు చేసుకునేలా చూడాలన్నారు. పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసులు 9394574814 ను సంప్రదించాలని తెలియజేశారు.

హత్యలకు దారితీస్తున్న వివాహేతర సంబంధాలు

● తెగిపోతున్న పేగు బంధాలు

● రోడ్డున పడుతున్న కుటుంబాలు

వనపర్తి క్రైం, మార్చి9 (ఆంధ్ర జ్యోతి): జిల్లాలో వివాహే తర సంబంధాలతో పేగుబంధాలు తెగిపోతున్నాయి. ప్రియుడితో కలిసి కట్టుకున్న భర్తనే కాటికి పంపుతున్న ఘటనలు జిల్లాలో చోటు చేసుకున్నాయి. కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాల్సిన వారు ఆకర్షణతో వివాహేతర సంబంధాలు పెట్టుకుంటున్నారు. ఈ క్రమంలోనే కొన్ని బంధాలు విడిపోతుండగా మరికొందరు తప్పు చేసిన వారిని అంత మొందిస్తున్నారు. రెండేళ్లలో ఇలాంటి ఘటనలు జిల్లాలో ఎన్నో చోటు చేసుకున్నాయి. వివాహేతర సంబంధాలే కాకుండా ప్రేమలో పడిన జంటలు సైతం అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు.

కలకలం రేపిన ఘటనలు

ఐదునిమిషాల సుఖం కోసం పెట్టుకునే అక్రమ సంబంధాలు హత్యలకు దారితీస్తున్నాయి. ఈ ఏడాది జిల్లాలో జరిగిన రెండు ఘటనలు కలకలంరేపాయి. ప్రేమ పేరుతో ఓ వర్గానికి చెందిన యువకుడిని ప్రేమించి పెళ్లి చేసుకోవాలని యువతి ఒత్తిడి తీసుకురావడంతో హత్యకు దారితీసింది. కొంతమంది వివాహేతర సంబంధాల కారణంగా వారి బంధువులు, కుటుంబ సభ్యులు తెలిసి ఆత్మహత్యలకు దారితీస్తున్నాయి. దంపతులు ఒకరు తప్పు చేస్తే వారిని హత్య చేయడానికి వెనుకాడటం లేదు. ప్రేయసి, ప్రియుడితో కలిసి భర్తను హత్య చేయించిని సంఘటనలు ఉన్నాయి. గత ఏడాది పెబ్బేరు పట్టణంలోని ఉపాధ్యా యురాలితో తోటి ఉపాధ్యాయుడు అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. ప్రేయసితో కలిసి ఆమె భర్తను చంపేందుకు కుట్ర చేశారు. కానీ తీవ్ర గాయాలతో ఆయన బయటపడ్డాడు. రెండు నెలల క్రితం వనపర్తి పట్టణంలోని కళాశాలలో చదువుకునే యువతి మరో వర్గానికి చెందిన యువకుడిని ప్రేమించింది. పెళ్లికి నిరాకరించడంతో పెళ్లి చేసుకోకపోతే చనిపో అని యువతి చెప్పడంతో బ్లేడ్‌తో గొంతు కోసుకుని ఆ యువకుడు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ నెల 1వ తేదీన పాన్‌గల్ పట్టణానికి చెందిన ఓ మహిళ అక్రమ సంబంధం భర్తకు తెలియడంతో ఇంట్లో గొడవలకు దారి తీసింది. దీంతో ఆమె ప్రియుడు, అతని స్నేహితులు కలిసి ఈనెల 1వ తేదీన తెల్లవారు జామున ప్రియురాలి భర్తను హత్య చేశారు. ఇవే కాకుండా లోలోపల ఎన్నో వివాహేతర సంబంధాలు హత్యలతో పాటు ఆత్మహత్యలకు దారితీస్తున్నాయి.

స్త్రీలను గౌరవించడం నేర్చుకోవాలి



డీఎస్పీ వెంకటేశ్వరరావు

స్త్రీలను తన కుటుంబ సభ్యుల్లో ఒకరిగా గౌరవించడం నేర్చుకోవాలి. అప్పుడే వారి మీద చెడు ఆలోచన రాదు. స్త్రీ విలువలు తెలియక వివాహేతర సంబంధాలు పెట్టుకుని తమ ప్రాణాలను కోల్పోవడంతో పాటు కుటుంబాలను రోడ్డున పడేస్తున్నారు. ప్రస్తుతం సోషల్ మీడియా ఒక ఫ్యాషన్‌గా మారింది. వీటికి సాధ్యమైనంత వరకు ప్రతీ ఒక్కరు దూరంగా ఉండాలి. ప్రధానంగా చదువుకునే యువతీ, యువకులు చదువుపై దృష్టి సారించి జీవితంలో స్థిరపడ్డాక ఒకరి మనసులు ఒకరు గెలుచుకుని వివాహాలు చేసుకోవాలి. అక్రమ సంబంధం ఎన్ని రోజులకైనా చెడుకు దారి తీస్తుంది.

- డీఎస్పీ వెంకటేశ్వరరావు

జీతాలు లేక పస్తులుంటున్నాం

» ఎనిమిది నెలలుగా ఇబ్బంది పడుతున్న ప్రభుత్వ ఆసుపత్రి కాంట్రాక్టు ఉద్యోగులు

» అధికారులు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం

» ఉద్యోగ భద్రత కల్పించకుంటే ఉద్యమిస్తామని వెల్లడి



కలెక్టరేట్ ముందు నిరసన తెలుపుతున్న ఉద్యోగులు(ఫైల్)

గద్వాల క్రైం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తే కాంట్రాక్ట్ ఉద్యోగులు 8 నెలలుగా జీతాలు అందకపోవడంతో పస్తులుంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. దీనికి తోడు ఆ ఉద్యోగులు టీవీవీపీ కిందికి వస్తారా... లేదా ప్రభుత్వం జనరల్ ఆసుపత్రి పరిధిలోకి వస్తారా అన్న అనుమానంతో తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఉద్యోగులుగా ఉన్నంతవరకు జీతాలు వచ్చేవని, ఇటీవలే జనరల్ ఆసుపత్రిగా మారడంతో జీతాలు ఎవరు ఇవ్వాలో తెలియని పరిస్థితి ఏర్పడిందని కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని బ్లడ్‌బ్యాంక్, ఐసీయూ, జర్నల్ విభాగంలో 10, 15 సంవత్సరాల నుంచి పనిచేసే కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ 50 మంది ఉద్యోగులకు 8 నెలలుగా జీతాలు అందక ఇ బ్బంది పడుతు న్నారు. ఇందులో బ్లడ్ బ్యాంకులో 13 మంది, ఐసీయూలో 20 మంది, జర్నల్ విభాగంలో 17 మంది కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా సేవలందిస్తున్నారు. జీతాల కోసం పలుమార్లు వైద్యాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని, పూట గడవక పస్తులుంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పులు చేసి కుటుంబాన్ని గడుపుతున్నామని, జీతాలు రాక 8 నెలలు కావడంతో అప్పులు కూడా పుట్టడం లేదని వారు అవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డికి సమస్యలను విన్నవిస్తున్న ఉద్యోగులు(ఫైల్)

ఉద్యోగ భద్రత కల్పించాలి

మొన్నటి దాకా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఉండేంతవరకు జీతాలు సక్రమంగా చెల్లించేవారని, ఉద్యోగ భద్రత విషయంలో కూడా ఇబ్బందులు ఉండేవి కాదని, ప్రస్తుతం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అయిన నేపథ్యంలో ఈ ఉద్యోగులు డీఎం ఈ(డైరక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్) పరిధిలోకి వస్తా మా... టీవీవీపీ(తెలంగాణ వైద్య విధాన పరిషత్) పరిధిలోకి వస్తామా అన్న అనుమానంతో భయాం దోళన చెందుతు న్నారు. జీతాల విషయంలో మాకు సంబంధం లేదంటే.. మాకు సంబంధం లేదని డీఈఎం ప్రిన్సిపల్, టీవీవీపీ సూపరింటెండెంట్ చెబుతున్నారని వాపోతున్నారు. అంతేగాక ఉద్యోగాలు కూడా ఉంటాయో.. ఊడుతాయో అంటున్నారని ఆందోళన చెందుతున్నారు. తమకు సకాలంలో జీతాలు ఇవ్వడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతున్నారు.

పెండింగ్ జీతాలు ఇవ్వాలి



ఎనిమిది నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలి. జిల్లా వైద్యాధికారులు, కలెక్టర్, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కావడం లేదు. ఆసుపత్రి, కలెక్టరేట్ ముందు నిరసన కూడా తెలిపామన్నారు. పెండింగ్ జీతాలు ఉద్యోగ భద్రత కల్పించకుంటే ఉద్యమిస్తాం.

- బీ రామకృష్ణ, తెలంగాణ మెడికల్ ఔట్ సోర్సింగ్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

త్వరలోనే జీతాలు అందేలా చూస్తాం..

జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి జనరల్ ఆసుపత్రిగా మారిన తర్వాత అందులో ఉన్న టీవీవీపీ ఉద్యోగులు డీఎంఈలో మారిన విషయం తెలిసిందే. ఇందులో ఎవరెవరు ఏఏ శాఖలో ఉన్నారు. ఎంతమంది విధులు నిర్వహిస్తున్నారు అనే విషయాలను నిర్ధారిస్తున్నారు. ఏ ఏ ఉద్యోగి ఎప్పటి నుంచి ఉన్నారు అనే విషయాలపై పూర్తిస్థాయిలో ఆరాతీస్తున్నారు. పూర్తి వివరాలను నిర్ధారించుకున్న తర్వాత త్వరలోనే జీతాలు అందేలా చర్యలు తీసుకుంటాం.

- డాక్టర్ ఇందిరా, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్

మైసమ్మ దేవత దర్శనం కోసం పోటెత్తిన భక్తులు



నాయినోనిపల్లి మైసమ్మ దేవతను దర్శించుకుంటున్న భక్తులు

పెద్దకొత్తపల్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని నాయినోనిపల్లి గ్రామ శివారులోని మైసమ్మ దేవత దర్శనం కోసం ఆదివారం భక్తులు పోటెత్తారు. నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, గద్వాల, వనపర్తి జిల్లాల నుంచే కాకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఈ ఆదివారం దాదాపు 20వేల మంది భక్తులు మైసమ్మ దేవతను దర్శించుకున్నారు. భక్తుల నుంచి ఈ ఆదివారం టికెట్ ద్వారా రూ. 35,865, హుండీ ద్వారా రూ.82,137 మొత్తం 1,18,200 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఈవో రామేశ్వరశర్మ, చైర్మన్ శ్రీనివాస్ యాదవ్ తెలిపారు.

రైతులకు 54 ట్రాన్స్‌ఫార్మర్లు పంపిణీ



పెద్దకొత్తపల్లి సబ్‌స్టేషన్‌లో రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లను పంపిణీ చేస్తున్న ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు

పెద్దకొత్తపల్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : రైతుల అవసరాలను ప్రభుత్వం గుర్తించి రైతులకు 54 ట్రాన్స్‌ఫార్మర్లను ట్రాన్స్‌కో చీఫ్ జనరల్ మేనేజర్ శివాజీ, సూపరింటెండెంట్ ఇంజనీర్ బాలరాజు పంపిణీ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో కల్వకోల్, మరికల్, సాతాపూర్, చెన్నపురావుపల్లి, నారాయణపల్లి, గంట్రావుపల్లి, పెద్దకొత్తపల్లి, దేదినేనిపల్లి గ్రామాల రైతులకు అధికారులు ట్రాన్స్‌ఫార్మర్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో డీఈలు శ్రీధర్, రవికుమార్, ఏఈ రాజేష్‌గౌడ్, మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ దండు నరసింహ, మాజీ సర్పంచ్‌లు సత్యం, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

సహాయక చర్యల్లో కీలక ముందడుగు

(5వ పేజీ తరువాయి)

చేయడం ద్వారా మరింత పక్కాగా గుర్తించే అవకాశం ఉందని తెలుస్తోంది. అయితే వచ్చే రెండు మూడు రోజుల్లో మిగతా వారి మృతదేహాలు కూడా బయటపడే అవకాశం ఉంది. 16 రోజులుగా శ్రమిస్తున్న సహాయక బృందాలకు కార్మికుల జాడ కనిపించకపోవడంతో నిరాసక్తత ఆవరిస్తున్న తరుణంలో ఒకరి మృతదేహం లభించింది. దాంతో మిగతా వారిని కనిపెట్టడానికి నైతిక స్థైర్యం పెరుగుతుందని చెప్పొచ్చు.



లోకో ట్రైన్‌లో టన్నెల్‌లోకి వెళ్తున్న సహాయక బృందం

మైన్స్ మాదిరిగా సపోర్ట్స్..

టీబీఎం వ్యర్థాలను, మట్టిని బయటకు తరలించడం ఇప్పట్లో సాధ్యమయ్యే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో సింగరేణి కాలరీస్ జీఎం డీఎల్ బైద్యా, రెస్క్యూ టీం మేనేజర్ రాజేందర్‌రెడ్డి మైన్స్‌లో మాదిరిగానే ఇక్కడా ప్రణాళికలు చేస్తున్నారు. మట్టి తరలించకుండా.. పై నుంచి కూలకుండా ఉండేందుకు కోల్ మైన్స్‌తోపాటు ఇతర అండర్ గ్రౌండ్ మైన్స్‌లో టైగర్ క్లాగ్స్‌ను వాడతారు. వాటిని సపోర్ట్‌గా తీసుకుని.. లోపల తవ్వకాలు జరపుతారు. ఇప్పుడు అదే విధానం ఇప్పుడు అమలు చేయనున్నారు. క్యాడవర్ డాగ్స్‌కు కూడా ఈ విధానం వల్ల కార్మికుల బాడీలు ఎక్కడ ఉన్నాయో కచ్చితంగా గుర్తించేందుకు వీలు ఏర్పడుతుంది. అలాగే ఆ ప్రాంతం అంతా షీర్ జోన్ కావడం వల్ల మరో ప్రమాదం సంభవించకుండా ఉండేందుకు లోడ్‌సెల్, టిల్ సెల్ అనే పరికరాలను వినియోగిస్తారు. ఒకవేళ ఏదైనా సమయంలో పైకప్పు కూలే అవకాశం ఉంటే.. ముందుగానే ఆ పరికరాలు హెచ్చరికలు జారీ చేస్తాయి. దాంతో సహాయక చర్యల్లో పాల్గొంటున్నవారు బయటపడే అవకాశం ఉంటుంది.

ఏజెన్సీల సహకారంతో : డీఎల్ బైద్య, సింగరేణి కాలరీస్ జీఎం



లోకో ట్రైన్‌లో బయటికి తెచ్చిన శకలాలు

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంలో సహాయక చర్యలు చాలా క్లిష్టంగా ఉన్నాయి. అందుకే చాలా సమయం పడుతోంది. ఇప్పుడు టీబీఎం పార్ట్స్‌ను బయటకు తరలిస్తూ లోపలకు వెళ్తున్నాం. క్యాడవర్ డాగ్స్, జీపీఆర్ గుర్తించిన రెండు ప్రాంతాల్లోని ఒక ప్రాంతంలో తవ్వి గుర్‌ప్రీత్ సింగ్ మృతదేహాన్ని బయటకు తీశాం. మరో మూడు ప్రాంతాలను డాగ్స్ గుర్తించాయి. ఆ ప్రాంతాల్లో కూడా టైగర్ క్లాగ్స్‌ను వాడుతూ తవ్వకాలు చేస్తున్నాం. అన్ని ఏజెన్సీల సహకారంతో పనులు సాగుతున్నాయి. ఆ ప్రాంతం షీర్ జోన్ కావడంతో ప్రమాదకరంగానే ఉంది. అయినా అందరినీ బయటకు తీసుకువస్తాం. గుర్‌ప్రీత్‌సింగ్ బాడీని ఇంటాక్ట్‌లోనే ఉండటం కోసం దాదాపు 12 గంటలు శ్రమించాం.

చెక్‌డ్యాంలో మునిగి గొర్రెల కాపరి మృతి

చిన్నచింతకుంట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : గొర్రెలకు స్నానం చేయించేందుకు చెక్‌డ్యాం వద్దకు వెళ్లిన గొర్రెల కాపరి నీటిలో మునిగి మృతి చెందిన ఘటన ఆదివారం మండలంలోని ఏదులాపూర్ గ్రామ సమీపంలోని ఊకచెట్టు వాగులో ఉన్న చెక్‌డ్యాంలో చోటు చేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. కౌకుంట్ల మండలం అప్పంపల్లి గ్రామానికి చెందిన గొర్రెల కాపరి గొల్ల మహేష్ (25) రోజు మాదిరిగా గొర్రెలను మేపుకునే ప్రయత్నంలో ఊకచెట్టు వాగులోని చెక్‌డ్యాం వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో గొర్రెలకు స్నానం చేయించేందుకు నీటిలోకి దిగి ప్రమాదవశాత్తు జారి చెక్‌డ్యాంలో పడిపోయాడు. ఈత రాకపోవడంతో కొట్టుమిట్టాడటంతో గమనించిన తోటి గొర్రెల కాపరి సాయిలు మహేష్‌ను కాపాడేం దుకు ప్రయత్నించినా.. ఫలితం దక్కలేదు. దీంతో సాయిలు చుట్టు పక్కల వారిని పిలువగా, మహేష్ అప్పటికే మృతి చెందాడు. మృతుడికి భార్యతో పాటు పిల్లలు ఉన్నారు. కాగా ఈ విషయంపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

» కల్వకుర్తి ఎస్ఐ జి.మాధవరెడ్డి



సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న ఎస్ఐ మాధవరెడ్డి

కల్వకుర్తి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కల్వకుర్తి ఎస్ఐ జి.మాధవరెడ్డి, ట్రైనింగ్ ఎస్ఐ మనోహర్‌రెడ్డిలు అన్నారు. కల్వకుర్తి పట్టణంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ చాంపి యన్‌షిప్ జిల్లాస్థాయి సెలక్షన్స్ జరిగాయి. ఈ నెల 23న హైదరా బాద్‌లోని ఔటర్‌రింగ్ రోడ్డు కొల్లూరులో జరిగే తెలంగాణ 4.400మీటర్ల చాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు నిర్వహిం చిన క్రీడలను వారు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివాలని, అనుకున్న లక్ష్యాలను చేరుకోవాల ని సూచించారు. క్రీడల్లో సైతం రాణి స్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు. క్రీడల వల్ల శారీరక దారుఢ్యం, మానసిక వికా సం చేకూరుతుందని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు ఎస్ఐ మాధ వరెడ్డి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్ర మంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధా న కార్యదర్శి డాక్టర్ సోలపోగుల స్వాములు, పీడీలు ఎస్.ప్రసాద్, బాలయ్య, పీఈటీలు రాజేందర్, పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

మాట తప్పిన సీఎం రేవంత్‌రెడ్డి

» ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఏసన్న




బల్గెరలో అంతర్రాష్ట్ర రహదారిపై బైఠాయించిన ఎమ్మార్పీఎస్ నాయకులు

గట్టు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ విషయంలో నిర్లక్ష్యం వహిస్తూ మాదిగలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మోసం చేస్తున్నారని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఏసన్న డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని బల్గెరలో అంతర్రాష్ట్ర రహదారిపై ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి రోడ్డుపై బైఠాయించి, నిరసన తెలిపారు. దీంతో వాహనాల రాకపోకలు నిలిచి కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ ఏబీసీడీ వర్గీకరణ చేపట్టకుండా గ్రూప్-1, గ్రూప్-2 ఫలితాలు విడుదల చేయరాదని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. డప్పు కొడుతూ నిరసన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి మాదిగ, ఉప కులాలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుని ఏబీసీడీ వర్గీకరణ పూర్తిగా అమలుపర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం పోలీసులు అక్కడికి చేరుకుని ఎమ్మార్పీఎస్ నేతలను అరెస్టు చేసి అక్కడి నుంచి పోలీసు స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కోకన్వీనర్ బండారి తుము డేవిడ్, వ్యవసాయ వృత్తిదారుల జిల్లా కార్యదర్శి ఎంజీ నర్సింహులు, ఆనంద్, తోలు భీమయ్య, వెంకట్ పెద్ద సామెల్, కొమ్ముల సుధాకర్ హాజరయ్యారు.

ఆహో.. హలీం

● పాలమూరులో ఇరానీ వంటకాల ఘుమఘుమలు



- రంజాన్ మాసంలో జోరుగా విక్రయాలు
- ఆఫర్లతో ఆకర్షిస్తున్న వ్యాపారులు
- రద్దీ నెలకొంటున్న హరీస్ సెంటర్లు
- నెల రోజుల పాటు ఎంతో మందికి ఉపాధి

మహబూబ్‌నగర్ అర్బన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : రంజాన్ మాసం అంటే ఎవరికైనా ఠక్కున గుర్తుకొచ్చేది హలీం.. హరీస్.. ఒకప్పుడు హైదరాబాద్ వంటి మహానగరానికే పరిమితమైన ఈ ఇరానీ వంటకాలు నేడు అన్ని నగరాలు, పట్టణాలు, మండల కేంద్రాల్లోనూ అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం రంజాన్ మాసం ప్రారంభం కావడంతో మహబూబ్‌నగర్‌తో పాటు ఇతర పట్టణాలు, జిల్లా, మండల కేంద్రాల్లో హలీం కేంద్రాలు వెలిశాయి. సాయంత్రం నాలుగు గంటలు నుంచే ఆ కేంద్రాల వద్ద వినియోగదారుల సందడి కనిపిస్తోంది. రంజాన్ మాసంలోనే లభించే హలీం, హరీస్ రుచి చూసేందుకు ప్రజలు ఇష్టపడుతున్నారు. అందుకు అనుగుణంగా వ్యాపారులు కూడా ప్రత్యేక ఆఫర్లు ఇస్తూ వారిని ఆకట్టుకుంటున్నారు. కొన్ని చోట్ల ఒక హలీం కొంటే మరొకటి ఉచితంగా ఇస్తున్నారు. మరికొన్ని చోట్ల ఉచితంగా కూల్‌డ్రింక్స్ ఇస్తున్నారు. మహబూబ్‌నగర్ నగరంలోని న్యూటౌన్, క్లాక్‌టవర్, వన్‌టౌన్, పద్మావతి కాలనీ, శ్రీనివాసకాలనీ, టీడీగుట్ట, మదీన మసీద్, హౌసింగ్ బోర్డు కాలనీ చౌరస్తా తదితర ప్రాంతాల్లో దాదాపు 40 పైగా హలీం, హరీస్ విక్రయ కేంద్రాలు వెలిశాయి. రంజాన్ ఉపవాస దీక్షలు చేసే ముస్లింలతో పాటు, ఇతర వర్గాలకు చెందిన కూడా ఈ వంటకాన్ని అరగించేందుకు ఇష్టపడుతున్నారు. పొట్టేలు మాంసం, నెయ్యి, గోధుమ, పప్పులు, ఎండు ఫలాలు, రవ్వతో హలీం, హరీస్‌లను తయారు చేస్తారు.

దీంతో ఇది బలవర్థకమైన పోషకాహారంగా చెప్పవచ్చు. మటన్ హలీం ప్లేట్ రూ.220 నుంచి రూ.260, చికెన్ హరీస్ రూ.80 నుంచి రూ.150 వరకు విక్రయిస్తున్నారు. ఈ సీజన్లో హలీం తయారు చేసే మాస్టర్లకు చాలా డిమాండ్ ఉంటుంది.



హలీంను డబ్బాల్లో ప్యాకింగ్ చేస్తున్న వ్యాపారులు

రూ. 10 కోట్లకుపైగా వ్యాపారం

రంజాన్ మాసంలో మహబూబ్‌నగర్‌లో దాదాపు రూ.7 కోట్లు, మిగతా చోట్ల రూ.3 కోట్లకు పైగా హలీం వ్యాపారం సాగుతుంది. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని నాగర్‌కర్నూల్, గద్వాల, వనపర్తి, నారాయణపేట, జడ్చర్ల, కల్వకుర్తి, కొల్లాపూర్, దేవరకద్ర తదితర పట్టణాలతో పాటు ప్రధాన మండల కేంద్రాల్లో హలీం, హరీస్ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. నెల రోజుల పాటు వేలాది మంది ఉపాధి పొందుతున్నారు.

42 ఏళ్లుగా విక్రయాలు



మా కుటుంబ సభ్యులు 42 ఏళ్లుగా హరీస్ కేంద్రం నడుపుతున్నారు. హలీం ఒకటి కొంటే మరొకటి ఉచితంగా ఇస్తున్నాం. గతంలో నగరంలో ప్రధాన ప్రాంతాల్లోనే దుకాణాలు ఉండేవి, ప్రస్తుతం 50కి పైగా వెలిశాయి. దీంతో పోటీ పెరిగింది. గిరాకీలు బాగానే ఉన్నాయి.

- మహ్మద్ బురాన్, నయాబ్ హలీంసెంటర్, మహబూబ్‌నగర్



హలీం సర్వ్ చేస్తున్న వ్యాపారులు

అంగరంగ వైభవంగా రథోత్సవం

వడ్డేపల్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండల పరిధిలోని జూలకల్ సమీపంలో శివాలయం వద్ద ఆదివారం భ్రమరాంబ మల్లికార్జున స్వామి రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా అర్చకులు స్వామివారికి ఉదయం రుద్రాభిషేకం, హోమం, శివపార్వతుల కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం సాయంత్రం నిర్వహించిన రథోత్సవంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. రథోత్సవం సందర్భంగా రాయచూర్ రహదారిపై సుమారు కిలోమీటరు మేర వాహనాలు నిలిచిపోయారు. జాతర సందర్భంగా ఈ నెల 11వ తేదీ ఎద్దుల బల ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కరోనా మహమ్మారికి ఐదేళ్లు..



● ఉమ్మడి జిల్లాలో తొలి కేసు నమోదు

● విమానాశ్రయంలో విధులు నిర్వహిస్తూ కరోనా బారిన పడిన వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ● జడ్చర్ల కావేరమ్మపేటకు చెందిన వ్యక్తి..

భయభ్రాంతులు.. భయానక వాతావరణాన్ని కల్గించి.. జన జీవనాన్ని చిన్నాభిన్నం చేసిన కరోనా.. ఇప్పటికీ మరిచిపోలేకున్నామంటే అతిశయోక్తి కాదు. ఇలాంటి మహమ్మారి వచ్చి నేటికీ(మార్చి 10) ఐదేళ్లు అవుతోంది. ఎంతోమంది ప్రాణాలను పొట్టనపెట్టుకోవడం.. మరెందరో అనారోగ్యం బారిన పడిన బాధలు, కష్టాలు అంతా ఇంతా కాదు.. దాని ఊసు తలచుకుంటేనే ఇప్పటికీ వణుకు పుట్టక మానదు. దీని బారినుంచి తప్పించుకునేందుకు అప్పట్లో పడిన ఇక్కట్లు వర్ణనాతీతం. అయితే, ఈ కరోనా తొలి కేసు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోనే నమోదు కావడం గమనార్హం. వైద్య, ఆరోగ్య శాఖలో విధులు నిర్వహిస్తున్న హెల్త్‌అసిస్టెంట్... శంషాబాద్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయంలో విదేశాల నుంచి వచ్చిన వారికి కోవిడ్ టెస్టులు నిర్వహిస్తూ కరోనా బారిన పడడం తెలిసిందే. ఇలా దీనిబారిన పడి అనేకులు అష్టకష్టాలు పడ్డారు. మాస్కులు ధరించడం.. శానిటైజేషన్ పూసుకోవడం.. వేడి పదార్థాలు తీసుకోవడం.. క్వారంటైన్(ఇళ్లకే పరిమితం) కావడం వంటి సంఘటనలు ఇప్పటికీ మన కళ్లను కుదిపేస్తున్నాయి.

జడ్చర్ల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : కరోనా మహమ్మారికి ఐదేళ్లు నిండాయి. ఐదు సంవత్సరాల కిందట ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో తొలికేసు నమోదు అయ్యింది ఈ రోజే. వైద్య, ఆరోగ్య శాఖలో విధులు నిర్వహిస్తున్న హెల్త్ అసిస్టెంట్.. శంషాబాద్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయంలో విదేశాల నుంచి వచ్చిన వారికి కోవిడ్ టెస్టులు నిర్వహిస్తూ కరోనా బారిన పడ్డాడు. జడ్చర్ల మునిసిపాలిటీలోని కావేరమ్మపేటలో నివాసం ఉంటూ రాజాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించే సదరు వ్యక్తికి కరోనా పాజిటివ్ రావడంతో ఉమ్మడి జిల్లా అంతా ఒక్కసారిగా అలర్ట్ అయ్యింది. 2020 మార్చి 10న సదరు వ్యక్తికి కరోనా పాజిటివ్ నిర్ధారణ అయ్యింది. కాగా అంతకు నాలుగు నెలల ముందే ప్రపంచ వ్యాప్తంగా కరోనా కేసులు నమోదయ్యాయి. ఉమ్మడి జిల్లాలోనే జడ్చర్లలో తొలి కేసు నమోదు కావడంతో జిల్లా యంత్రాంగం అంతా అప్రమత్తం అయ్యింది. కోవిడ్ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తదితర అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు ప్రారంభించింది. కరోనా పాజిటివ్ తొలి కేసు నమోదు కావడంతో ప్రజలు సైతం భయాందోళనలకు గురయ్యారు.

కరోనా మహమ్మారిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రచార మాధ్యమాలతో పాటు ప్రధాన కూడళ్ల వద్ద మైకు సెట్ ఏర్పాటు చేసి కరోనా బారిన పడకుండా చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించేలా చర్యలు తీసుకున్నారు. తుమ్ములు, దగ్గుతో వచ్చే తుంపిరి నుంచి ఒకరి నుంచి మరొకరికి కరోనా వ్యాప్తి చెందుతుందని, ప్రతి ఒక్కరు మాస్క్ ధరించాలని సూచించారు. రోగ నిరోధకశక్తిని పెంచుకునేవిధంగా యోగా చేయాలని, అందుకు తగ్గ కూరగాయలు తినాలంటూ అవగాహన కల్పించారు. జడ్చర్ల నేతాజీచౌరస్తాలో ప్రధాన రహదారిపై మునిసిపాలిటీ ఆధ్వర్యంలో కరోనా భూతం మాదిరిగా చిత్రాన్ని పెయింటింగ్ వేయించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఫైర్‌ఇంజన్‌లతో ప్రధాన రహదారులలో శానిటైజేషన్‌ను పిచికారి చేయించారు. కేవలం మూడు రోజుల వ్యవధిలోనే ఉమ్మడి జిల్లాలో రెండో కేసు సైతం జడ్చర్ల మునిసిపాలిటీలోని కావేరమ్మపేటలో నమోదు అయ్యింది. దీంతో జడ్చర్ల మునిసిపాలిటీలో మరిన్ని జాగ్రత్త చర్యలు అధికారులు చేపట్టారు. జడ్చర్లలోని కూరగాయల మార్కెట్‌కు వచ్చే వినియోగదారులకు హైపోక్లోరైడ్ ద్రావణంతో శుద్ధి చేసే కార్యక్రమాన్ని జడ్చర్ల మునిసిపల్ అధికారులు చేపట్టారు.

మటన్ మార్కెట్‌లను సైతం ఖాళీ స్థలాలకు మార్చి కొనుగోలు చేసేందుకు వచ్చిన వారిని సుమారు ఒక మీటరు దూరంలో నిలబడి కొనుగోలు చేసేవిధంగా చర్యలు తీసుకున్నారు. కరోనా అనే పదాన్ని వినడానికే ప్రజలు భయాందోళనలకు గురైన సంఘటనలున్నాయి.



జడ్చర్ల మునిసిపాలిటీలో మినీట్రాక్టర్‌కు ట్యాంకును ఏర్పాటు చేసి హైపోక్లోరైడ్ ద్రావణంను పిచికారి చేస్తున్న అప్పటి తెలంగాణ రాష్ట్ర సంగీత, నాటక అకాడమీ చైర్మన్ బాదిమి శివకుమార్ (ఫైల్)

క్రైం కార్నర్ ■ అర్ధరాత్రి ఇంట్లో చోరీ

- బంగారు, వెండి అపహరణ



చోరీ జరిగిన ఇంట్లో క్లూస్‌టీమ్‌తో పరిశీలిస్తున్న ఎస్‌ఐ గురుస్వామి

తాడూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని సిర్సవాడ గ్రామంలో ఇంటికి తాళం వేసిన పరిస్థితులను గమనించి శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. వివరాల ప్రకారం.. సిర్సవాడ గ్రామానికి చెందిన మల్లయ్య తన కుటుంబ సభ్యులతో పాటు మన్యంకొండ దేవాలయానికి వెళ్లడంతో ఇంటికి తాళం వేశారు. దీంతో గమనించిన దుండగులు అర్ధరాత్రి చోరీకి పాల్పడి ఇంటి తాళాన్ని విరగ్గొట్టి ఇంట్లోకి చొరబడి బీరువాను ధ్వంసం చేశారు. అందులో ఉన్న 25 గ్రాముల నాణు, 5గ్రాముల చెవిపోగు, రెండు జతలకు సంబంధించి 30గ్రాముల వెండితో పాటు 20వేల రూపాయల నగదును అపహరించుకునిపోయారు. తెల్లవారుజామున ఇంట్లో చోరీ జరిగినట్లు గమనించి మల్లయ్యకు సమాచారమివ్వడంతో హుటాహుటిన చేరుకుని పోలీసులకు సమాచారమందించారు. దీంతో ఘటనా స్థలికి ఎస్‌ఐ గురుస్వామి, క్లూస్‌టీమ్ చేరుకుని చోరీ జరిగిన విధానాన్ని పరిశీలించి వేలిముద్రలు స్వీకరించారు. జరిగిన చోరీ ఘటనపై మల్లయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. చోరీకి గురైన దాదాపు 3లక్షలకు పైగా సొమ్ము కావడం మూలంగా కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రాజాపూర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలంలోని ముదిరెడ్డిపల్లి గ్రామంలోని స్థానిక జాతీయ రహదారి 44పై జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. జడ్చర్ల పట్టణానికి చెందిన వేరుగంటి సత్యనారాయణ శర్మ (70) తన వృత్తి(పురోహితం) నిమిత్తం ముదిరెడ్డిపల్లి గ్రామంలో వివాహం చేసేందుకు వస్తున్నారు. ముదిరెడ్డిపల్లి క్రాస్ రోడ్డు దగ్గర తన ద్విచక్ర వాహనంపై రోడ్డు దాటుతుండగా జడ్చర్ల వైపు నుంచి వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీకొన్నది. దీంతో రోడ్డుపై పడి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు అతడ్ని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో మహబూబ్‌నగర్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మరో వ్యక్తి తన ద్విచక్ర వాహనాన్ని అజాగ్రత్తగా నడపడం వల్లే తమ పెద్దనాన్న మృతి చెందాడని, వారి బంధువు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మరికల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా మరికల్ మండల శివారులో తీలేరు గేట్ సమీపాన శ్రీవాణి విద్యామందిర్ పాఠశాల ఎదురుగా ఆదివారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. మృతి చెందిన వ్యక్తి వయస్సు దాదాపు (60) ఉంటుందన్నారు. ఈ వ్యక్తి ఎక్కడి నుంచి ఎక్కడికి పోతున్నడో తెలియదు. కానీ రోడ్డు ప్రమాదం మృతి చెందాడు. ఎవరైన గుర్తు పడితే మరికల్ పోలీస్‌స్టేషన్‌క సమాచారం అందించాలన్నారు.

బస్సు ఎక్కబోయి.. అదుపు తప్పి..

- కిందపడి గాయపడిన వృద్ధురాలు
- ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి

ఆత్మకూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): బస్సు ఎక్కబోయి.. అదుపు తప్పి కిందపడి వృద్ధురాలు కాలు విరిగి.. చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన ఆత్మకూరు పట్టణ కేంద్రంలో చోటు చేసుకుంది. ఆత్మకూరు ఎస్‌ఐ నరేందర్ తెలిపిన వివరాల ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పాలమూరు జిల్లా చిన్నచింతకుంట మండలం అప్పంపల్లి గ్రామానికి చెందిన కురువ తిమ్మమ్మ అనారోగ్యం నిమిత్తం ఆత్మకూరు ఆసుపత్రికి ఆదివారం వచ్చింది. తిరుగు ప్రయాణంలో అప్పంపల్లి గ్రామానికి వెళ్లేందుకు మెగా హోటల్ పక్కన ఉన్న బస్‌స్టాప్‌లో వేచి ఉంది. ఈ క్రమంలో ఆత్మకూరు నుంచి పాలమూరు జిల్లాకు వెళ్తున్న పాలమూరు డిపోకు చెందిన బస్సు ఎక్కేందుకు ప్రయత్నించింది. పూర్తిగా ప్రయాణికులు బస్సు ఎక్కే వరకు కూడా డ్రైవర్ బస్సు నిలపకుండా వెళ్లడంతో పట్టు తప్పిన కురువ తిమ్మమ్మ బస్సు వెనక టైర్ కింద పడి ఎడమ కాలు విరిగి తీవ్ర రక్తస్రావం అయింది. దీంతో తోటి ప్రయాణికులు అంబులెన్స్‌ను పిలిపించి ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు మృతురాలి అన్న ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని బస్సును పోలీస్ స్టేషన్‌లో నిలిపి బస్సు డ్రైవర్ చంద్రకాంత్ రెడ్డిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

30 ఏళ్లుగా..

● శ్రీశైలానికి ధనసిరి గ్రామస్థుల పాదయాత్ర

- నాడు 9మందితో ప్రారంభం.. నేడు 900మందితో కొనసాగింపు
- ధనసిరి గ్రామ మఠం పీఠాధిపతి ఆధ్వర్యంలో ప్రారంభించిన యాత్ర
- పాదయాత్ర భక్తులకు అడుగడుగునా స్వాగతం పలుకుతున్న శివ భక్తులు

భూత్పూర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి); ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 30 ఏళ్లుగా శ్రీశైలం మల్లన్న దర్శన భాగ్యం కోసం వందలాది సంఖ్యలో భక్తులు పాదయాత్రగా తరలి వెళుతున్నారు. ఓ మఠం పీఠాధిపతి ఆధ్వర్యంలో 9మందితో ప్రారంభించిన పాదయాత్ర నేడు 900 మందితో శ్రీశైలం మల్లన్న సన్నిధికి చేరుకొనేందుకు ఉత్సాహంగా వెళుతున్నారు. వివరాల్లోకి వెళితే.. తెలంగాణ రాష్ట్రంలోని సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని ధనసిరి అనే గ్రామంలో పురాతన శివాలయం ఉంది. శివాలయ మఠం పీఠాధిపతి అయిన వీరేశ్వర శివాచార్య అనే గురు స్వామి తన చిన్నతనం నుంచి శివభక్తుడు. అయితే 1995వ సంవత్సరంలో 9మంది భక్తులతో శ్రీశైలం మల్లన్న దర్శనం కోసం శివరాత్రి అయిన మొదటి బుధవారం పాదయాత్ర (కాలినడక)ను ప్రారంభించారు. అంతే ఇక ప్రతీ ఏటా శ్రీశైలం వెళ్లేందుకు భక్తులు కాలినడకన రెండు జతల దుస్తులను చేతి సంచీలో పెట్టుకొని "వస్తున్నం... వస్తున్నం మల్లన్న..." అంటూ భజనలు చేస్తూ ఉత్సాహంగా పాదయాత్రగా తరలిపోతున్నారు. ఈ సందర్భంగా కాలి నడకన వచ్చిన భక్తులు ఆదివారం భూత్పూర్ మునిసిపాలిటీలోని అమిస్తాపూర్ గ్రామంలో గల సాక్షీగణపతి దేవాలయానికి చేరుకున్నారు. మఠం పీఠాధిపతి అయిన వీరేశ్వరశివాచార్య వారి ఆధ్వర్యంలో రెండు గంటల పాటు ఏకధాటిగా భజనలు చేశారు. అనంతరం అక్కడే ఆలయ కమిటీ వారు ఏర్పాటు చేసిన భోజనాన్ని భక్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి మఠం పీఠాధిపతి వీరేశ్వరశివాచార్య మాట్లాడారు.

శ్రీశైల మల్లన్నకు కాలినడకన నడుచూకుంటూ వెళ్లి ధూళి దర్శనం చేసుకుంటే ఎంతో పుణ్యం లభిస్తుందన్నారు. 30 ఏళ్ల కాలినడక అనుభవంతో చెబుతున్నా.. శివుడు భక్తుల కోరికలను తప్పక తీరుస్తాడని, ఆ నమ్మకం నాతో పాటుగా ప్రతి ఏటా శివయ్య దర్శనానికి వచ్చే భక్తులకు ఉందని మఠం పీఠాధిపతి తెలిపారు. ప్రతీ ఏటా కాలినడకన శ్రీశైలం శివయ్య దర్శనానికి సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్, ధనసిరి గ్రామాలతో పాటుగా పలు గ్రామాల భక్తులు, అదే విధంగా మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని హైద్రాబాద్, మహబూబ్‌నగర్, భూత్పూర్, అమిస్తాపూర్, నాగర్‌కర్నూల్, అచ్చంపేట వంటి ప్రాంతాల నుంచి భక్తులు శివయ్య దర్శనానికి మధ్యలో చేరుతారని అన్నారు. ప్రతీ రోజు 35కిలోమీటర్ల దూరం వరకు నడుస్తూ... మధ్యలో అక్కడక్కడ సేద తీర్చుకుంటూ... ఆ శివుడి నామం మనస్సులో తలుచుకుంటూ వెళుతుంటామని మఠం పీఠాధిపతి తెలిపారు.

ఇప్పటి వరకు కాలినడక భక్తులకు ఎలాంటి ఆపదలు రాలేవని, అంతా ఆ శివయ్యనే చూసుకుంటాడని గురూజీ వివరించారు. అంతకు ముందు అమిస్తాపూర్‌లోని సాక్షీగణపతి దేవాలయ కమిటీ సభ్యులు ప్రభులింగం, ఆలయ అర్చకులు రవిశంకర్, ప్రభులింగం తదితరులు పాదయాత్ర భక్తులకు ఘన స్వాగతం పలికారు. అదే విధంగా భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కాలినడక భక్తులు ప్రభాకర్‌రెడ్డి, నాగయిదలాయ్, హనుమంతప్ప, శివాకుమార్, మురయ్యస్వామి, చిన్న, మహేష్, నాగయ్య, మంజునాథస్వామి, వీరితో పాటుగా వందల సంఖ్యంలో పాల్గొన్నారు.



భూత్పూర్ గణపతి దేవాలయంలో ధనసిరి గ్రామ పాదయాత్ర భక్తులతో పీఠాధిపతి వీరేశ్వర శివాచార్య

రంజీ జట్టుకు ఎంపిక కావాలి

- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు ఏపీ జితేందర్‌రెడ్డి



క్రీడాకారుడు డేవిడ్ క్రిపాల్‌ను అభినందిస్తున్న జితేందర్‌రెడ్డి, తదితరులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటి రంజి జట్టుకు ఎంపిక కావాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు, రాష్ట్ర ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఏపీ జితేందర్‌రెడ్డి అన్నారు. ఈ నెల 11న కోల్‌కతాలో నిర్వహించనున్న బీసీసీఐ విన్నీ టోర్నీలో పాల్గొనే సౌత్‌జోన్ జట్టుకు జిల్లా కేంద్రానికి చెందిన డేవిడ్ క్రిపాల్ ఎంపికయ్యాడు. శనివారం రాత్రి జిల్లా కేంద్రంలో జితేందర్‌రెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టోర్నీలో ప్రతిభ చాటి జాతీయ జట్టుకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి రాజశేఖర్, ఉపాధ్యక్షుడు సురేష్‌కుమార్, కోచ్ గోపాలకృష్ణ పాల్గొన్నారు.

మహిళతో అసభ్యప్రవర్తన

అడిగినందుకు కొడుకుపై కత్తితో దాడి

నవాబ్‌పేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పొలం వద్ద ఉన్న ఓ మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన విషయం తెలుసుకున్న ఆమె కుమారుడు నిలదీసిన పాపానికి కత్తితో దాడి చేసిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలంలోని ఓ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ విక్రం కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మహిళ ఈనెల 7న పొలం వద్ద పని చేస్తుండగా అదే గ్రామానికి చెందిన బక్క సాయికుమార్ మరో యువకుడు కలిసి ఆమెతో అసభ్యంగా ప్రవర్తించారు. ఈ విషయం తెలుసుకున్న ఆమె కుమారుడు మా అమ్మతో ఎందుకు అసభ్యంగా ప్రవర్తించారని ఈనెల 9న ఉదయం 9 గంటల ప్రాంతంలో సాయికుమార్ ఇంటికి వెళ్లి నిలదీశాడు. కోపంతో ఊగిపోయిన అతడు ఇంట్లోకి వెళ్లి కత్తి తీసుకువచ్చి దాడికి దిగాడు. ఇది గమనించిన ఇరుగు పొరుగువారు మందలించగా సాయికుమార్ పారిపోయాడు. తీవ్ర రక్తస్రావంతో ఉన్న ఆమె కుమారుడిని 108లో జిల్లా ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు.

● కొడుకుపై దాడి చేశారని...

ఇదిలా ఉండగా, తమ కొడుకు అసభ్యంగా ప్రవర్తించాడని ఆరోపిస్తూ ఇంట్లోకి చొరబడి రాత్రిపూట సాయికుమార్‌పై దాడి చేశారని సదరు గ్రామానికి చెందిన తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ విక్రం తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పీర్లగుట్టకు నిప్పు



మంటలను అదుపు చేస్తున్న స్నేక్ సొసైటీ సభ్యులు

వనపర్తి రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): వనపర్తి పట్టణ కేంద్రంలోని పీర్లగుట్టకు శనివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టారు. పీర్లగుట్టకు దగ్గర భాగంలోనే చాలా మంది గుడిసెలలో నివాసం ఉంటున్నారు. గుట్టల్లో మంటలు రావడంతో గమనించిన కుటుంబాల వారు భయాందోళనకు గురై కేకలు వేశారు. కేకలు విన్న చుట్టు పక్కల వాళ్లు ఉలిక్కిపడి ఎవరికి సమాచారం అందించాలో తెలియక స్నేక్ సొసైటీ అధ్యక్షుడు కృష్ణ సాగర్‌కు విషయం చెప్పారు. స్పందించిన ఆయన తన సభ్యులతో ఘటన స్థలానికి చేరుకున్నారు. చెట్ల కొమ్మలతో చెలరేగుతున్న మంటలను కొడుతూ మంటలను ఆర్పేశారు. దీంతో చుట్టు పక్కల గుడిసెల్లో ఉన్న కుటుంబాలు ఊపిరి పీల్చుకున్నారు.

మిర్చి తరలిస్తున్న ట్రాక్టర్ బోల్తా



జడ్చర్ల పట్టణంలో బోల్తా పడిన ట్రాక్టర్ ట్రాలీ

జడ్చర్ల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : భూత్పూర్ మండల కేంద్రంలో ఆదివారం జరిగే సంతలో విక్రయించేందుకు ఎండు మిర్చిని తరలిస్తున్న ట్రాక్టర్ బోల్తా పడింది. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం నసరుల్లాబాద్ గ్రామానికి చెందిన కేశవులు అనే రైతు పండించిన ఎండుమిర్చిని భూత్పూర్‌లో జరిగే సంతలో విక్రయించేందుకు అదే గ్రామానికి చెందిన ట్రాక్టర్ ట్రాలీలో తరలిస్తున్నాడు. జడ్చర్ల పట్టణంలోని సిగ్నల్‌గడ్డ వెళ్లే దారిలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ సమీపంలో ప్రమాదవశాత్తు బోల్తా పడింది. ట్రాక్టర్ ఇంజన్‌కు ముందున్న టైరు ప్రమాదవశాత్తు ఊడిపోవడం కారణంగా ట్రాక్టర్ ట్రాలీ బోల్తా పడిందని సమీపంలోని కొందరు తెలిపారు. బోల్తా పడిన ట్రాక్టర్‌లో నుంచి ఇండుమిర్చి అంతా కిందపడింది. అనంతరం బోల్తా పడిన ట్రాక్టర్‌ను సరిచేసి, ఎండుమిర్చిని తరలించారు.

న్యూస్ బాక్స్

ఆలయ నిర్మాణానికి రూ.30 వేల ఆర్థిక సాయం



బిజినేపల్లిలో నిర్మాణంలో ఉన్న రేణుక ఎల్లమ్మ ఆలయ ప్రధాన ద్వారం ప్రతిష్ఠ పూజలు చేస్తున్న భక్తులు

బిజినేపల్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : రేణుకాఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మిద్దె రాములు రూ.30 వేల ఆర్థిక సాయం అందజేశారు. మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న రేణుకాఎల్లమ్మ ఆలయ ప్రధాన ద్వారం ప్రతిష్ఠలో ఆదివారం పాల్గొని ప్రత్యేక పూజలు చేసి మాట్లాడారు. ఆలయ అభివృద్ధికి తన వంత కృషి చేస్తానని ఆలయ కమిటీ సభ్యులకు హామీ ఇచ్చారు. మరింత మంది దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందజేసి ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ప్రత్యేక పూజలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్థులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



ఆర్థిక సహాయం అందజేస్తున్న లక్ష్మారెడ్డి

వంగూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన సంజమ్మ కుటుంబాన్ని ఆదివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల లక్ష్మారెడ్డి పరామర్శించారు. తన వ్యక్తిగతంగా కొంత ఆర్థిక సహాయం అందజేశారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకునేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సైదులు, విష్ణు, చందుయాదవ్, లక్ష్మయ్య, సైదులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన బీఆర్ఎస్ నాయకుడు

వెల్దండ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ వెల్దండ పట్టణ అధ్యక్షుడు పిల్లి దేవేందర్ ముదిరాజ్ ఆ పార్టీని వీడారు. ఆదివారం కల్వకుర్తిలో జరిగిన కార్యక్రమంలో జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆచారి పిల్లి దేవేందర్‌కు బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి ఎన్నం శేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కుర్మిద్ద యాదగిరి, నాయకులు మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

'హామీలు అమలు చేయాలి'

కోడేరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మండల సీపీఎం కార్యదర్శి పి.నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలన్నారు. ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు అయినా ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. పేద ప్రజలకు రేషన్ కార్డులు, పింఛన్లు, ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్రూం తదితర అత్యవసరమైన సమస్యలను తీర్చడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు రవి, లక్ష్మయ్య, మాలిక్, వెంకటమ్మ, లక్ష్మి, రాములు, వెంకటస్వామి పాల్గొన్నారు.

'పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి'



మాట్లాడుతున్న ఆంజనేయులు

చారకొండ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ కార్మికులకు ప్రతీ నెల కనీస వేతనం రూ. 26వేలు ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బి. ఆంజనేయులు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన గ్రామపంచాయతీ కార్మికులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పంచాయతీ కార్మికులకు నేటికి కూడా ఉద్యోగ భద్రత లేకుండా పోతుందని అన్నారు. గ్రామాల్లో సర్పంచులు మారినప్పుడల్లా కార్మికులను అక్రమంగా తొలగించడం మానుకోవాలని అన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా నెల జీతం సరిపోవడం లేదని అన్నారు. పంచాయతీ కార్మికులు అర్థాకలితో జీవిస్తూ గ్రామాల్లో పారిశుధ్య పనులు చేస్తున్నారని అన్నారు. కార్మికులకు మూడు నెలలుగా జీతాలు అందక కుటుంబాలను పోషించుకోలేకపోతున్నారని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బండపల్లి బాలస్వామి, కార్మికులు గెల్వయ్య, మల్లయ్య, వెంకటేష్, మొగులమ్మ, శేఖర్, రామ్‌కోటి, బురాన్, రాములు, కవిత, వెంకటయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అభివృద్ధి పథం వైపు నడిపిస్తున్నాం

- ఎక్సైజ్ శాఖ మంత్రి కృష్ణారావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

అచ్చంపేటటౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మారిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అభివృద్ధి పథంలో నడిపిస్తూ ముందుకు సాగుతున్నామని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణతో కలిసి మంత్రి విలేకర్ల సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఏర్పాటు కోసం ఒక్కో పాఠశాలకు రూ.200కోట్లు మంజూరు చేసిందన్నారు. రాష్ట్రంలో మొత్తం 50ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల కోసం రూ.11వేల కోట్లు ప్రభుత్వం నిధులు విడుదల చేసిందన్నారు. అదే విధంగా రాష్ట్రంలోని ప్రతీ రైతుకు రైతు భరోసా డబ్బులు ఈ నెలాఖరులోగా జమఅవుతాయని స్పష్టం చేశారు. రాష్ట్రంలో రైతు రుణమాఫీ కాని వారికి కూడా రుణమాఫీ చేసే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. గత ప్రభుత్వంలో కేసీఆర్ చేసిన అప్పులకే మా ప్రభుత్వం దాదాపు రూ.6వేల కోట్లు ప్రతీ నెల చెల్లిస్తున్నదని తెలిపారు. 15 రోజులుగా ఎస్ఎల్‌బీసీలో చిక్కుకున్న వారి కోసం ప్రభుత్వం అన్ని విధాలా వారికి అండగా నిలబడుతూ అధికారులు అనునిత్యం పర్యవేక్షిస్తున్నారన్నారు. ఈ రోజు ఒక మృతదేహం లభ్యమైందని, వారి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయంతో పాటు మృతదేహాన్ని అప్పగిస్తామన్నారు. మునిసిపల్ చైర్మన్ శ్రీని వాసులు, నాయకులు మల్లేష్, ప్రతాప్ గౌడ్ పాల్గొన్నారు.

నిరుపేదల కోసమే ఇందిరమ్మ ఇళ్లు

- ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ



పబ్బతి ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

పదర, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదల కోసమే ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. ఆదివారం మండలంలోని గానుగపెంట గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పునాది పనులను ప్రారంభించారు. అదేవిధంగా మండలంలోని మద్దిమడుగు పబ్బతి ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ నల్లమల అడవుల్లో మారుమూల గ్రామాల్లోని అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి కార్యకర్తలకు పార్టీ అండదండలు పుష్కలంగా ఉంటాయని, అందరికీ మంచి భవిష్యత్ ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఏఆర్.యాదవ్, వంశీ, యువసేన అధ్యక్షుడు నెల్లికంటి శివకుమార్, మద్దిమడుగు ఆలయ చైర్మన్ రాములు నాయక్, సభ్యులు హాలరాజు, శ్రీను, అంజి, విజయ్, లింగయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అసౌకర్యం కలగొద్దు

ఉప్పునుంతల : మండల పరిధిలోని మామిళ్లపల్లి గ్రామంలో ఈ నెల 11 నుంచి 16వ తేదీ వరకు జరిగే లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలకుండా చూడాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ పాలక మండలి సభ్యులకు సూచించారు. ఆదివారం ఆయన స్వామివారి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేకపూజలు చేసి, బ్రహ్మోత్సవాల పనుల గురించి ఆలయ ఈవో నరసింహులుతో చర్చించారు. అచ్చంపేట మునిసిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, ఆలయ చైర్మన్, నర్సింహ్మారావు, నాయకులు మల్లేష్, కృష్ణ, గోవర్ధన్‌రెడ్డి, మొగులాల్, రేణయ్య ఉన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

బల్మూరు : మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో రూ.22లక్షలతో చేపట్టే నూతన గ్రామపంచాయతీ భవనం పనులకు ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆదివారం భూమి పూజ చేశారు. బల్మూరులో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్, పల్లె దవాఖాన, రూ.16లక్షలతో నిర్మించిన భవనాన్ని ప్రారంభించారు. ఎన్ఆర్ఈజీఎస్ 22లక్షలు గ్రామపంచాయతీ 5లక్షలు నిధులతో నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల అవసరాలను తీర్చేందుకు కృషి చేస్తుందని అన్నారు. పెండింగ్‌లోనివి కూడా త్వరలో పూర్తి చేసి ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, కిసాన్‌సెల్ అధ్యక్షుడు ఎస్‌డీ.ఖదీర్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాంప్రసాద్‌గౌడ్, కాశన్నయాదవ్, మశన్న, ఎంపీడీవో రాఘవులు, పీఆర్ఏఈ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్‌నాయక్, కాంట్రాక్టర్ నరసింహారెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ



జిల్లా కేంద్రంలో కుట్టు మిషన్లు అందుకున్న మహిళలతో ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి, నాయకులు

నాగర్‌కర్నూల్‌టౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : ఎంఎస్ఎంఈ ద్వారా శిక్షణ పొందిన మహిళలకు ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని తేజ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్‌తో కలిసి ఎమ్మెల్యే లబ్ధిదారులకు కుట్టుమిషన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం తగిన ప్రణాళికతో ఉందన్నారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు, కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ.హబీబ్, పార్టీ మండల అధ్యక్షుడు కోటయ్య, మాజీ కౌన్సిలర్లు కొత్త శ్రీనివాసులు, ఎండీ.నిజాముద్దీన్, తీగల సునేంద్ర, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా చౌడేశ్వరీ దేవి ఆభరణాల ఊరేగింపు



మంగనూర్‌లోని చౌడేశ్వరి దేవి ఆభరణాలను ఊరేగిస్తున్న యాదవులు

బిజినేపల్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మంగనూర్ గ్రామంలోని చౌడేశ్వరీ దేవి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారి ఆభరణాలను యాదవులు అంగరంగ వైభవంగా ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారి విగ్రహానికి అలంకరించారు. అలాగే గంపల మహోత్సవం ద్వారా అమ్మవారికి సమర్పించే నైవేద్యం తయారీకి వినియోగించే పదార్థాలను ప్రత్యేకంగా మహిళలు భక్తిశ్రద్ధలతో ఊరేగింపుగా ఆలయానికి తరలివచ్చారు. అనంతరం చౌడేశ్వరీ దేవి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు



హైదరాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే గువ్వల సమక్షంలో చేరిన కాంగ్రెస్ నాయకులు

ఉప్పునుంతల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ వ్యవహార శైలి నచ్చక మండల పరిధిలోని మామిళ్లపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మమ్మ భర్త కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాజల్‌రావుతో పాటు ప్రభాకర్‌రావు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. చేరిన వారికి ఆయన పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాజల్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేనప్పుడు పార్టీని కాపాడుకుంటూ వచ్చామని తెలిపారు. పార్టీ అధికారంలో లేనప్పుడు ఆలయ చైర్మన్ తాత్కాలికంగా ఇచ్చి పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే మా గ్రామస్థులకు తెలియకుండా వేరే గ్రామానికి చైర్మన్ కట్టబెట్టడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఆలయ భూములు ఎక్కడ ఉంటే ఆ గ్రామం వారికి డైరెక్టర్లు పదవులు ఇచ్చేవారు కాని ఇప్పుడు కొత్త ఆచారం తీసుక వచ్చి సొంత నిర్ణయాలు తీసుకున్నారని, అందుకే పార్టీ అవలంబిస్తున్న ఒంటెత్తు పోకడలు నచ్చక కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరినట్లు ఆయన తెలిపారు. సముచిత స్థానం లభించలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కొత్త రవీందర్‌రావు, మాజీ సర్పంచ్ దామాదర్, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ రామస్వామిగౌడ్, పార్టీ నాయకులు మురళీధర్‌రావు తదితరులు ఉన్నారు.

మహనీయులకు ఘన నివాళి అర్పిద్దాం



భీమ్‌దీక్ష వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న జిల్లా స్వేరోస్ నాయకులు

తెలకపల్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గడ్డంపల్లి గ్రామంలో జిల్లా స్వేరోస్ జాయింట్ సెక్రటరీ మిద్దె ధర్మరాజు ఆధ్వర్యంలో భీమ్‌దీక్ష వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గడ్డంపల్లి మాజీ సర్పంచ్ మిద్దె లక్ష్మయ్య మాట్లాడుతూ మహనీయుల చరిత్రలు, వారి త్యాగాల ఆలోచన విధానాలను ప్రస్తుత సమాజాన్ని చైతన్యపరుస్తూ జ్ఞాన సమాజాన్ని నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ధర్మరాజు మాట్లాడుతూ మార్చి 15 నుంచి ఏప్రిల్ 14వరకు భీమ్ దీక్ష జరగనున్నట్లు తెలియజేశారు. నేలకొండపల్లి ఖమ్మం జిల్లాలో జరగబోయే భీమ్‌దీక్ష ప్రారంభ సభకు జిల్లా నుంచి పెద్ద ఎత్తున తరలి వెళ్లాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డపాకుల శివశంకర్, సంపత్ కుమార్, వంగూరు మండల అధ్యక్షుడు దార్ల కాశన్న, కొమ్ము రమేష్, బాలస్వామి, ఎర్రోళ్ల మశయ్య, చాకలి బాలస్వామి, కొమ్ము ఉషన్న, మిద్దె వెంకటయ్య, పి.సుధాకర్, ఎల్లయ్య పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

నాగర్‌కర్నూల్ క్రైం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతూ బండారు మనీషా (32)మృతి చెందినట్లు ఎస్ఐ గోవర్ధన్ ఆదివారం తెలిపారు. వివరాల ప్రకారం... వనపట్లకు చెందిన బండారు విష్ణువర్ధన్‌రెడ్డి మనీషా స్కూటీపై ఈనెల 7న నాగర్‌కర్నూల్ వచ్చి తిరిగి సొంత గ్రామానికి వెళ్తుండగా నూతన కలెక్టరేట్ కార్యాలయ సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటో ఢీ కొట్టింది. ఘటనలో మనీషాకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్నప్పటికీ పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందిందని తెలిపారు. దీంతో మృతురాలి మరిది శ్యాం సుందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు.

భక్తి ద్వారానే మనిషికి ముక్తి

- మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి



పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

తిమ్మాజిపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : భక్తి ద్వారానే మనిషికి విముక్తి లభిస్తుందని నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని అప్పాజీపల్లి గ్రామంలో రెండు రోజులుగా కొనసాగుతున్న వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో మర్రి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులనుద్దేశించి మాట్లా డారు. ఈ సందర్భంగా ఆదివారం వాల్మీకి ఆలయ ఆవరణలో మహాగణపతి పూజతో పాటుగా వివిధ పూజలు ధాన్యాధివా సము చేశారు. భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో హోమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అన్నదానం చేశారు. మాజీ సర్పంచ్ జల్లి తిరుపతమ్మ, ఆలయ కమిటీ సభ్యులు అంతకు ముందు మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు. అదేవిధంగా శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. బీఆర్ఎస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు జోగు ప్రదీప్, మాజీ ఎంపీపీ రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు దయాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వేణుగోపాల్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ హుసేని, కొత్త వెంకటేశ్, నాయకులు స్వామి, వెంకటయ్య, అయూబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

- మాజీ మంత్రి సి.లక్ష్మారెడ్డి



బాధిత కుటుంబానికి పరామర్శిస్తున్న మాజీమంత్రి సి.లక్ష్మారెడ్డి

ఊర్కొండ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : బాధిత కుటుంబానికి అండగా ఉంటామని మాజీమంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని జకినాలపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ తలసాని సాయిరెడ్డి ఇటీవల మృతి చెందారు. ఆదివారం ఆయన గ్రామానికి చేరుకొని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీలో చురుకైనా నాయకుని కోల్పోవడం చాలా బాధాకరమని, ఆయన మృతి పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. వారి వెంట బీఆర్ఎస్ నాయకులు వీరారెడ్డి, బక్క జంగయ్య, మ్యాకల శ్రీనివాసులు, గోపాల్‌గుప్త, కృష్ణగౌడ్, అంజనేయులు, శేఖర్‌యాదవ్, శ్రీకాంత్‌రెడ్డి, రాజశేఖర్, రవి, కొండగిరి, అక్బర్ ఉన్నారు.

1104 యూనియన్ సబ్ డివిజన్ కమిటీ ఎన్నిక



సబ్ కమిటీ అధ్యక్షుడు భానుగౌడ్‌ను సన్మానిస్తున్న యూనియన్ సభ్యులు

కొల్లాపూర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : టీజీఎస్పీడీసీఎల్ 1104 యూనియన్ కొల్లాపూర్ సబ్ డివిజన్ కమిటీ అధ్యక్షుడిగా వేముల భానుగౌడ్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఎండీ పాషా, కోశాధి కారిగా కృష్ణ, ట్రెజరర్‌గా ఎండీ అస్లంలను ఎన్నుకున్నట్లు టీజీఎస్పీడీసీఎల్ జిల్లా అధ్యక్షులు రాంచందర్ నాయక్ జిల్లా కార్యదర్శి నిరంజన్ యాదవ్ పేర్కొన్నారు. కొల్లాపూర్ పట్టణంలోని సబ్ స్టేషన్ కార్యాలయం వద్ద జరిగిన టీజీ ఎస్పీడీసీఎల్ 1104 కొల్లాపూర్ సబ్ డివిజన్ ఎన్నికల్లో భారీ మెజార్టీతో సబ్ డివిజన్ అధ్యక్షుడిగా వేముల భాను గౌడ్ ఎన్నికయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... టీజీ ఎస్పీడీసీఎల్ 1104 యూనియన్ పరంగా తమ సబ్‌డివి జన్ పరిధిలో పని చేస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీజీ ఎస్పీడీసీఎల్ 1104 యూనియన్ డివిజన్ యూనియన్ నాయకులు విజయ భాస్కర్ తిరుపతయ్య, బాబు, జానీ, రామ్మోహన్, కురుమూర్తి, పాషా తదితరులు పాల్గొన్నారు.

క్లాస్‌మెట్ క్లబ్ ఆధ్వర్యంలో క్రీడాపోటీలు విజయవంతం

కల్వకుర్తి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణంలోని మినీ స్టేడియంలో క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహించిన క్రీడాపోటీలు ఆదివారం ముగిశాయి. క్రికెట్ పోటీల్లో కల్వకుర్తి మండలం విన్నర్‌గా, రన్నర్‌గా వంగూరు నిలిచాయి. విజేతలకు బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమానికి ఎస్ఐ మాధవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అందజేశారు. క్రీడలతో శరీర దారుఢ్యం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో క్లాస్‌మేట్ క్లబ్ రాష్ట్ర కోశాధికారి పరమేశ్వర్, జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, జిల్లా కార్యదర్శి నరసింహారావు, డివిజన్ అధ్యక్షుడు శోభన్‌బాబు, ఉపాధ్యక్షుడు చిగుళ్లపల్లి శ్రీధర్, క్లాస్‌మేట్ క్లబ్ సభ్యులు చంద్రశేఖర్, రఘురామరావు, నరేష్, ఉపాధ్యాయులు చంద్రమోహన్, శశాంక్, ప్రకాశ్ తదితరులు ఉన్నారు.

ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి



తుమ్మలసూగురులో భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

తాడూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత సమాజంలోని ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉన్నప్పుడే ప్రశాంతమైన మానసికోల్లాసం కలుగుతుందని త్రైతసిద్ధాంతం- ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక నాగర్‌కర్నూల్, అచ్చంపేట కమిటీ అధ్యక్షుడు, సభ్యులు మనోహర్, సాయి శంకర్‌శ్రేష్టి అన్నారు. ఆదివారం మండలంలోని తుమ్మలసూగురు గ్రామంలో యోగీశ్వరస్వామి రచించిన 100 ఆధ్యాత్మిక రచనలను త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక అచ్చంపేట, నాగర్‌కర్నూల్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఇంటింటా పరిచయ కార్యక్రమం ఏర్పాటు చేసి భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం- ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక నాగర్‌కర్నూల్, అచ్చంపేట కమిటీల అధ్యక్షుడు సభ్యులు మనోహర్, సాయిశంకర్ శ్రేష్టి, ఆంజనేయులు యాదవ్, ఆత్మారాం, రమాదేవి, స్వప్న, శిరీష, అంజనమ్మ, వెంకటమ్మ, మంజుల పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు రూ. 12వేల జీవన భృతి చెల్లించాలి

- సీపీఎం మండల కార్యదర్శి అంతటి కాశన్న డిమాండ్



ఐతోల్ గ్రామంలో ఆటో కార్మికుల సమస్యలపై సర్వే నిర్వహిస్తున్న సీపీఎం మండల కార్యదర్శి కాశన్న

తాడూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా ఫ్రీ బస్సు వల్ల ఉపాధి కోల్పోయిన ఆటో రవాణా కార్మికులకు జీవన భృతి చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి అంతటి కాశన్న డిమాండ్ చేశారు. వారి సంక్షేమం కోసం సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలని, కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా తెచ్చిన మోటారు వాహనాల చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని కోరారు. మండల పరిధిలోని ఐతోల్ గ్రామంలో బస్టాండ్ దగ్గర ఆటో కార్మికుల సమస్యలపై సర్వే నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రూ.50లక్షల మంది రవాణా రంగంపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. వీరి సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి చట్టాలు తీసుకురాకపోగా వారి భవిష్యత్తును నిర్వీర్యం చేస్తున్నాయని మండిపడ్డారు. ఆటో రంగ కార్మికులకు జీవన భృతి కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, జీవన భృతి రూ.12వేలు చెల్లించాలని అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మోటారు వాహనాల చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శేఖర్, గోపాల్, ఎల్లయ్య, అజయ్, పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.